# వర్సిటీల అవసరాలపై ప్రభుత్వానికి నివేదిక!

హైదరాబాద్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని యూనివర్సిటీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కానికి తీసుకోవాల్సిన చర్యలపై రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు మంగళవారం విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా.. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి.. ఆయా వర్సిటీల వీసీలు, అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వర్సిటీలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై వారు చర్చించారు. వర్సిటీల్లో ఖాళీగా ఉన్న సుమారు 2,060 ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. అలాగే వర్సిటీలకు నిధుల విడుదలలో సమస్యలు ఉండడంతో నిధులను అందుబాటులోకి తేవాలని ప్రతిపాదించారు. ఈ మేరకు నివేదిక రూపొందించాలని నిర్ణయించారు. ముఖ్యమంత్రిని కలిసి ఆ నివేదిక అందించాలని భావిస్తున్నారు.



సదస్సును ప్రారంభిస్తున్న జేఎన్‌టీయూ ఇన్‌చార్జి వీసీ బాలకిష్టారెడ్డి

## ఫార్మా రంగానికి ఉజ్వల భవిష్యత్తు

● జేఎన్‌టీయూ ఇన్‌చార్జి వీసీ బాలకిష్టారెడ్డి

హైదరాబాద్ సిటీ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఫార్మాస్యూటికల్ రంగానికి ఉజ్వల భవిష్యత్తును అందించడంలో యంగ్ ప్రొఫెషనల్స్ కీలకపాత్ర పోషిస్తున్నారని, త్వరలోనే ఇండియన్ ఫార్మా మార్కెట్ 130 బిలియన్ డాలర్లకు చేరువ కానుందని జేఎన్‌టీయూ ఇన్‌చార్జి వైస్‌చాన్సలర్ డాక్టర్ బాలకిష్టారెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. 'ఇన్నోవేషన్స్ ఇన్ ఫార్మా- హౌ యంగ్‌లీడర్స్ కెన్ డ్రైవ్ చేంజ్' అంశంపై జేఎన్‌టీయూ ఆడిటోరియంలో మంగళవారం ఏర్పాటు చేసిన జాతీయ సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆవిష్కరణ, నాయకత్వం, సహకారం వంటి అంశాలలో నిపుణులతో మార్గదర్శకత్వం పొందడానికి ఈ సదస్సు వేదికగా నిలిచిందన్నారు. వినూత్న ఆలోచనలు, నాయకత్వ లక్షణాలు కలిగిన యువత భవిష్యత్తులో సరికొత్త అవకాశాలను కనుగొనాలని పిలుపునిచ్చారు. జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో అవగాహన ఒప్పందా(ఎంఓయూ)లను కుదుర్చుకోవడం ద్వారా విద్యార్థులకు ఆయా పరిశ్రమలలో తమ ప్రతిభను ప్రదర్శించే అవకాశాలు లభిస్తాయన్నారు. ప్రపంచానికి అవసరమైన సరికొత్త ఆవిష్కరణలు అందించడంలో పరిశ్రమలతో కలిసి విద్యాసంస్థలు కీలక పాత్ర పోషించాలన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రెక్టార్ విజయకుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, ఫార్మాస్యూటికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మాజీ అధ్యక్షుడు సురేశ్, అమెరికాకు చెందిన అల్బనీ ఫార్మసీ కళాశాల ఛైర్మన్ బోయిన్ బోహిడీ, క్రొయేషియాలోని ఫార్మసీ కౌన్సిల్ అధ్యక్షుడు మేన్సోనిక్ అరిజానా తదితరులు పాల్గొన్నారు.

## జేఎన్‌టీయూ స్నాతకోత్సవ నోటిఫికేషన్!

» మార్చిలో నిర్వహించాలని నిర్ణయం

హైదరాబాద్ సిటీ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ 13వ స్నాతకోత్సవానికి వర్సిటీ ఉన్నతాధికారులు ఎట్టకేలకు నోటిఫికేషన్ జారీ చేశారు. మార్చి మొదటి లేదా రెండో వారంలో ఈ కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించారు. ఈ మేరకు ఏర్పాట్లను ప్రారంభించారు. 2023-24 విద్యా సంవత్సరంలో జేఎన్‌టీయూ అనుబంధ, అఫిలియేటెడ్ కళాశాలల్లో యూజీ, పీజీ కోర్సులు పూర్తి చేసిన సుమారు 83 వేల మంది విద్యార్థులతో పాటు డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ(పీహెచ్‌డీ) పూర్తిచేసిన సుమారు 120 మంది డిగ్రీ పట్టాల కోసం గత నవంబరు నుంచి ఎదురు చూస్తున్నారు. స్నాతకోత్సవంలో వర్సిటీ చాన్సలర్ అయిన రాష్ట్ర గవర్నర్ చేతుల మీదగా పట్టాలను ప్రదానం చేయనున్నారు. డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ పూర్తి చేసిన అభ్యర్థులు ఒరిజినల్ డిగ్రీ(ఓడీ)ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని, ఇందుకోసం రూ.1000 రుసుం చెల్లించాలని వర్సిటీ అధికారులు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం వర్సిటీ వెబ్‌సైట్‌లో స్టూడెంట్ సర్వీసెస్ పోర్టల్‌ను లేదా క్యాంపస్‌లోని పరీక్షల విభాగాన్ని(స్టూడెంట్ సెక్షన్) సంప్రదించవచ్చన్నారు. కాగా, గౌరవ డాక్టరేట్‌కు గతంలో ఎక్కువగా విద్యావేత్తలు, శాస్త్రవేత్తలనే ఎంపిక చేయగా, ఈ దఫా దేశానికి వన్నె తెచ్చిన క్రీడాకారులు, కళాకారులను ఎంపిక చేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిసింది.